సమాచారం

నేడు, రేపు ప్రవచనం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారదా శంకరమఠంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణచే శ్రీ వామన చరిత్ర ప్రవచనం, 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీ పార్వతీ కల్యాణం ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బాలాజీనగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో... మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఐడీఎల్ కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు శ్రీవీరాంజనేయ శివాలయ బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ శ్రీ వీరాంజనేయ శివాలయం 16వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంజనేయ దండకం, హనుమాన్ చాలీసా పారాయణం, ఆకుపూజలు, సింధూరం పూజలు, మధ్యాహ్నం, అన్న సమారాధన, సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

5న కబీర్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సంఘం సురేందర్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న నామినేషన్లు, అదే రోజు ఉప సంహరణ, గుర్తుల కేటాయింపు 2వ తేదీన ఓటర్ల జాబితా విడుదల, 2 నుంచి 4వ తేదీ వరకు అభ్యర్థుల ప్రచారం, 5వ తేదీన ఎన్నికలు ఉంటాయన్నారు. కబీర్‌నగర్ కమిటీ హాలులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ ఉంటుందని తెలిపారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



మోతీనగర్: పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని శ్రీసద్గురు సాయిబాబా ఆలయం 21వ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీకే కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు కాగడ హారతి, సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ, పంచామృతంతో అభిషేకం, సామూహిక అర్చన, సాయిదత్త మూలమంత్ర హవనం, విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందన్నారు. రెండో రోజు కాగడ హారతి, శతకటాభిషేకం, అలంకరణ, సామూహిక సత్య దేవుని వ్రతం, భక్తులకు అన్నదానంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

నియామకం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో రవికుమార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మమత

కూకట్‌పల్లి: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా మూసాపేట డీసీ రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీజీవో అధ్యక్షురాలు వి.మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో ప్రతినిధులు కృష్ణయాదవ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి గాజుల పంపిణీ

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లోని శ్రీకనకదుర్గాదేవి, శ్రీశీతలాదేవి, శ్రీకాళికాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దోర్బాల కాశీనాథ్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.



క్రీడలకు ప్రోత్సాహం ఏది?

- అభివృద్ధికి నోచుకోని క్రీడా ప్రాంగణం
- సాయంత్రమైతే మందుబాబులకు అడ్డా..
- వసతులు లేక క్రీడలకు దూరమవుతున్న యువత
- కోచ్‌లను నియమించి క్రీడాకారులను తయారు చేయాలని డిమాండ్



ఆస్‌బెస్టాస్‌కాలనీ హుడా పార్కులోని మైదానంలో ఆడుతున్న యువకులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను తీర్చిదిద్ది దేశ ప్రతిష్టతకు పూనుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ నగరంలోని క్రీడాకారులకు మొండి చేయి మాత్రమే మిగిలింది. గతేడాది పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆట స్థలాలు, మైదానాలను గుర్తించి అభివృద్ధి చేపట్టి మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు.

◆ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్ ఆస్‌బెస్టాస్ కాలనీ మధ్య ఉన్న హుడా పార్కులోని మైదానంలో క్రీడా పరికరాలతో పాటు మైదానం కూడా అనువుగా లేకపోవటంతో క్రీడాకారులకు అసౌకర్యంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నాటి శాసనసభ్యుడు భిక్షపతి యాదవ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుల కృషితో హుడా పార్కులోని ఎకరం స్థలంలో క్రీడాకారులను ప్రోత్సహించటం కోసం షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు. నాడు ముమ్మరంగా ఈ ప్రాంత యువతకు క్రీడా పోటీలు నిర్వహించి ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఈ మైదానం పోకిరీలు, మందుబాబులకు అడ్డాగా మారింది.

◆ అంతేకాక ఈ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు, పరికరాలు, కంచె దేనికి పనికి రాకుండా పోయాయి. కనీస నిర్వహణ లేకపోవటంతో విద్యుత్ లైట్లు కూడా లేవు. ఎక్కువగా ఇక్కడ యువత పల్లెల నుంచి వచ్చి సెటిల్ అయిన వారే ఉన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీలు, పీజీలు చదువుతూ గ్రామాల్లో ఉపాధి లేక వలస వచ్చి ఇక్కడే పారిశ్రామిక వాడల్లో చిన్న చిన్న ఉద్యోగాలు సంపాదించుకుని బతుకుదెరువు చూసుకున్నారు.

◆ ఈ ప్రాంతంలో సుమారు 50 బస్తీలు, 20కి పైగా కాలనీలతో పాటు పారిశ్రామికవాడలు కూడా అధికంగా ఉండటంతో పాటు చిన్న, మధ్య తరగతి కుటుంబాలే ఎక్కువగా ఇక్కడ నివసిస్తున్నాయి. ఈ కుటుంబాల్లోని పిల్లలను ప్రోత్సహిస్తే క్రీడల్లో రాణిస్తారు. కానీ అందుకు తగ్గట్టుగా ఎలాంటి పార్కులు, మైదానాలు కూడా లేవు. ఈ పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో మాత్రమే పార్కులు, క్రీడా మైదానంలు ఉన్నాయి. వీటిపైనే ఈ బస్తీల యువత మొత్తం క్రీడలకు ఆధారపడాల్సి ఉంది. శని, ఆదివారాలు, పండుగ వంటి రోజుల్లో ఈ మైదానాలు, పార్కుల్లో యువత క్రీడలతో జాతరను తలపించేలా ఆడుతుంటారు.

◆ ఇక్కడి నుంచే ఎంతోమంది యువత మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఎన్నో అవార్డులు, రివార్డులు కూడా సాధించిన వారు ఉన్నారు. సరైన ప్రోత్సాహం లేకపోవటంతో ఇక్కడి క్రీడాకారులు నిరుత్సాహంగా ఉండాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు, సంక్షేమ సంఘాల సభ్యులు మొరపెడుతున్నారు. ఇక్కడి క్రీడా మైదానాలను తీర్చిదిద్ది బంగారు భవిష్యత్‌తో పాటు క్రీడల్లో ఉత్సాహం ఉన్న యువతను గుర్తించి వారికి తర్ఫీదు అందించి ప్రోత్సహిస్తూ క్రీడా కోచ్‌లను ఏర్పాటు చేసి క్రీడా మైదానాలు తీర్చిదిద్ది బంగారు భవిష్యత్ ఉన్న యువతకు బాటలు వేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రోత్సాహం లేక కలగానే...



నేటి పాలకుల అలసత్వం కారణంగా క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నోచుకోక ఇక్కడి క్రీడాకారులకు ప్రోత్సాహం లేక వారి కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. గతంలో క్రీడాకారులకు కోచ్‌లు, మైదానంలో ఆట వస్తువులతో కలకలలాడేది. నేడు ఆ పరిస్థితి లేదు. దశాబ్ద కాలంగా ఈ క్రీడా ప్రాంగణంలో వసతులు లేవు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. – చిరుమర్తి రాజు, పాపిరెడ్డినగర్

మైదానంలో వసతులు కల్పించాలి



ఇక్కడి యువత ఎక్కువ క్రీడలపై మక్కువగా ఉన్నారు. వీరిని ప్రోత్సహిస్తే జాతీయస్థాయి పోటీల్లో రాణించే సత్తా ఉంది. ఆస్‌బెస్టాస్ కాలనీలో క్రీడా మైదానాలకు అనువైన ప్రాంతం. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు క్రీడా మైదానాలను గుర్తించి వాటిలో మౌలిక వసతులు కల్పించాలి. కోచ్‌లను నియమించి యువతకు క్రీడల్లో తర్ఫీదు ఇస్తే దేశానికి మంచి పేరు తెస్తారు. – సాయి, ప్రగతినగర్



మందుసీసాలు



నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు



నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

- బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు
- హైటెక్ మోడ్రన్ హైస్కూల్‌లో రోడ్డు భద్రత అవగాహన సదస్సు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండటంతో భవిష్యత్‌లో ఏలాంటి ఇబ్బందులు తలెత్తవని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి హైటెక్ మోడ్రన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన లేక జరిగే పరిణామాలతో ప్రజలు ఇబ్బందులు పడకూడదంటే ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.

◆ ఇంటి నుంచి బయలు దేరిన వ్యక్తి సేఫ్‌గా ఇంటికి చేరుకునేందుకు ట్రాఫిక్ నియమ నిబంధనాలు ఎంతో తోడ్పడతాయని చెప్పారు. ట్రాఫిక్, ప్రమాధాల నివారణ కోసం ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే ట్రాఫిక్ గురించి అవగాహన కల్పిస్తే వారు భవిష్యత్‌లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించరని అన్నారు.

◆ అందుకోసమే ప్రతి స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. సిగ్నల్స్ విధి విధానాలు, జీబ్రా లైన్స్, క్రాసింగ్ లైన్స్ వన్‌వే, స్కూల్ జోన్స్ నిబంధనలను వివరిస్తామని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే జరిగే ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వలన కలిగే అనర్థాలను వివరించామన్నారు. విద్యార్థులు వారి కుటుంబసభ్యులకు కూడా చెప్పగలిగేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

◆ ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను శంకర్ రాజు నివృత్తి చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ అవగాహన సదస్సుకు సహకరించిన పాఠశాల ప్రిన్సిపాల్ పి. మంజుల, కోఆర్డినేటర్ డీఎస్ రాఘవేంద్ర సిబ్బందికి అభినందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది అబ్దుల్ మజీద్ ఖాన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని డ్రీమ్ వ్యూ కాలనీ, వసంత్‌నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రీమ్ వ్యూ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ లైన్, సీవరేజ్ ప్రపోజల్ పనులు, వసంత్‌నగర్లోని పార్కు, యూజీడీ పైపు లైన్ నిర్మాణ అభివృద్ధి పనులు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌లో ఇప్పటికే 99 శాతం పనులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. కేపీహెచ్‌బీ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఏఈ సాయిప్రసాద్, కాలనీ వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించారు. మెయిన్‌రోడ్డు నుంచి క్రొత్త బ్రిడ్జి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అదే విధంగా వి.రామరావునగర్‌లోని నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బస్తీ ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా సీసీ రోడ్డు పనులు, నాలా పనులను పూర్తి చేయాలన్నారు. పనులను నాణ్యమైన మెటీరియల్‌తో పూర్తి చేయాలని అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, జనరల్ సెక్రటరీ పిల్లి తిరుపతి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మురళి, ప్రసాద్, రోశయ్య, మధు, కేశవరావు, వాసు, రమేష్, అమ్ములు, లక్ష్మీ, వి.రామారావునగర్, అధ్యక్షుడు ఎస్.సత్యం, సాంబశివ, వెంకటయాదవ్, పీఆర్.శివ, ఆంజనేయులు, శివయ్య పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

కేజీఎన్‌నగర్‌లో ఘనంగా ఉర్సు



ఉర్సులో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు, తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కేజీఎన్‌నగర్ వద్ద ఉర్సు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అజీమ్‌బాయ్, మొయిజ్, చోట మొయిజ్, జావీద్‌బాయ్, వాజిద్, మెహినొద్దీన్, విఠల్ రెడ్డి, పల్లపు వేణు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న త్వరగా కోలుకోవాలని పూజలు

మూసాపేట: ప్రముఖ కథా నాయకులు, టీడీపీ నేత నందమూరి తారకరత్న త్వరగా కోలుకోవాలని చిత్తారమ్మ తల్లి ఆలయంలో టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల్కాజ్‌గిరి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉప్పు రామకృష్ణ, శరత్‌గౌడ్, కొత్తపల్లి రాముగౌడ్, మధు, భిక్షపతి, నగేష్, భాస్కర్, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ షెఫ్ కార్యక్రమం



భాగ్యనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని నారాయణ స్కూల్ ఏజీఎం వేణుగోపాల్ అన్నారు. భాగ్యనగర్‌కాలనీలోని నారాయణ స్కూల్‌లో మంగళవారం మాస్టర్స్ షెఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు తెచ్చిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శం



కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారు దగ్గర్లోని కంటివెలుగు కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటివెలుగు దేశానికే ఆదర్శవంతమైన పథకం అని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బు పంచని ఏకైక పార్టీ సీపీఐ

కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమామహేష్




సీపీఐ సభ్యత్వాలను పునరుద్ధరిస్తూ పత్రాలను అందజేస్తున్న ఉమామహేష్

రంగారెడ్డినగర్: కార్మికులకే రాజ్యాధికారం అందించే లక్ష్యంగా ఏర్పడిన పార్టీ సీపీఐ అని కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ సీపీఐ పార్టీ శాఖ కార్యకర్తల సభ్యత్వ పునరుద్ధణ కార్యక్రమం గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేష్ పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు.

◆ ఒక ప్రాంతం, కులం, మతం కోసం కాకుండా కార్మికుల సంక్షేమానికి అవతరించినదే సీపీఐ అని పేర్కొనసారు. పేదలకు భూములు, ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న దేశాల్లో పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకు క్యూబా, వియాత్నంలే ఉదాహరణ అని అన్నారు.

◆ భారతదేశంలో పోరాటాల ద్వారా లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచని ఏకైక పార్టీ తమదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా చాంద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాస్, శాఖ నాయకులు జావేద్, యాదగిరి, వీరమణి, లక్ష్మి, అల్తాఫ్, యాకుబ్, శ్రీపథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీ ధాతృత్వం



ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండకు చెందిన సుజాత కూతురు తరుణి. ఈ ఏడాది ఎంబీబీఎస్ ఫీజు రూ.25వేల చెక్కును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం వారికి అందజేశారు. – ఆల్విన్‌కాలనీ

క్రైం కార్నర్..

బెడిసికొట్టిన కిడ్నాప్ ప్లాన్

- చేధించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు

భాగ్యనగర్‌కాలనీ: పని చేసే కంపెనీ ఎండీ కుమారుడి కిడ్నాప్ యత్నాన్ని కేపీహెచ్‌బీ పోలీసులు చేధించారు. ముగ్గురిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంద్రకు చెందిన చించినాడా నర్సింహస్వామి అలియాస్ స్వామి (29), అదే జిల్లాకు చెందిన బాబు, బీదర్‌కు చెందిన ప్రశాంత్ (31)లు హైదర్‌నగర్‌లోని స్టాన్ పంప్స్ సంస్థలో ఉద్యోగులుగా పని చేస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. స్వామి 2015లో ఉద్యోగం మానేసి సొంత ఊరిలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు.

◆ అదే సమయంలో నాగరాజు, సురేష్‌లు పరిచయమయ్యారు. కొద్ది రోజులకు నాగరాజు, సురేష్‌లు దొంగ నోట్ల చలామణి కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చారు. అప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముగ్గురు సులువుగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. అందులో భాగంగానే ఎవరినైన కిడ్నాప్ చేయాలని ప్లాన్ వేశారు. తాను పనిచేసిన కంపెనీ యజమాని నాగేశ్వరరావు కుమారుడిని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేద్దామనుకున్నారు. డబ్బులు ఇవ్వని పక్షంలో యజమాని కుమారుడిని హత్య చేయాలని స్వామి నిర్ణయించాడు. పథకం ప్రకారం స్వామి నగరానికి తిరిగి వచ్చి నాగేశ్వరరావు కంపెనీలో ఉద్యోగానికి చేరాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న ప్రశాంత్, బాబులకు తాను అమలు చేసి పథకాన్ని వారికి వివరించాడు.

◆ దీపావళికి వారం రోజుల ముందు కంపెనీ వద్ద నాగేశ్వరరావు కుమారుడిని కిడ్నాప్ చేసేందుకు కారు తీసుకొని వచ్చారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు, జనం ఎక్కువగా ఉండటంతో కిడ్నాప్ చేయకుండానే వెనుదిరిగారు. తమ పన్నాగం విఫలం కావడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని సురేష్ (26), నాగరాజులు నాగేశ్వరరావుకు ఫోన్ చేసి "నీ కుమారుడిని కిడ్నాప్ చేసేందుకు కొంతమంది ప్లాన్ చేశారని వారి వివరాలు తెలిపేందుకు తమకు డబ్బులు ఇవ్వాలని" డిమాండ్ చేశారు.

◆ నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి పోలీసులు దిగారు. డబ్బులు తీసుకొని కిడ్నాపర్ల వివరాలు చెప్పాలని నాగేశ్వరరావు చేత సురేష్, నాగరాజులకు చెప్పించారు. డబ్బులు తీసుకొని వివరాలు తెలియజేయడానికి వచ్చిన సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నాగరాజు పరారయ్యాడు. సురేష్ ఇచ్చిన సమాచారంతో కిడ్నాప్ ప్లాన్ చేసిన నరసింహస్వామి, ప్రశాంత్‌లను అరెస్టు చేశారు. మిగతా ఇద్దరు నిందుతులు నాగరాజు, బాబులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.